


రుక్మిణి గంటనుంచి వీధిగుమ్మంలో భర్తకోసం ఎదురు చూస్తోంది. నిరీక్షణ మరీ విసుగుగావుంది. విసుగుమీద ఆకలి మరింత ఎక్కువయింది. దానికి సమాధానం చెప్పాలంటే భర్తరావాలి. బియ్యం తేవాలి. వండాలి. తినాలి తగ్గాలి.

బాలరాజు రెండు దాటాకా వగరుస్తూ- "ప్రకాశం రెండుసార్లు తిప్పించుకుని చివరికి అయిదిచ్చాడు రుక్కూ. కేజీ బియ్యం, వంకాయలు అరకేజీ తెచ్చాను. ఇంకేమయినా తేవాలా?" అంటూ వచ్చాడు.

రుక్మిణి భర్త చేతిలోని సంచీ అందుకుని, "పోపుసామాను వుంది లెండి. మీరు చన్నీళ్ళతో ముఖం కడుగుక్కోండి. చప్పున వంట

చేసేస్తాను." లోపలికెళ్ళింది.

బయట కారు హారన్ వినిపించింది అదేపనిగా. రుక్మిణి హాల్లోకి వెళ్ళి కిటికీనుంచి తొంగిచూసింది.

జీపులో పరమేశ్వరి!

రుక్మిణి పరుగున జీపు దగ్గర కెళ్ళింది - నమస్కారం చేస్తూ. పరమేశ్వరి కూలింగ్ గ్లాసు తీసి చిరాగ్గా చూసింది.

"నిద్రపోతున్నావా?"

"వంటవుతోందండి!"

"విందా?" వెటకరింపు.

రుక్మిణి బాధగా చూసింది. పరమేశ్వరి సింహం. రుక్మిణి మేక. సింహానికి మేక బాధ అనవసరం!

"ముఖ్యమైన మీటింగ్ వుంది. అరగంటలో రా. ఆలస్యం చెయ్యకు."

బాలరాజు ప్రయివేటు కంపెనీలో గుమస్తా. రెండొందలు వస్తాయి. కరువు రోజుల్లో అవేం సరిపోతాయి? అందుకే రుక్మిణి మహిళా సమాజంలో సెక్రటరీగా చేరింది. ఆమెకో వంద వస్తాయి.

రుక్మిణి హడావిడిగా వండి, భర్తకి వడ్డించింది.

రెండు మెతుకులు నోట్లో వేసుకుని రుక్మిణి బీరువా దగ్గరికి వచ్చింది. చీర పొద్దుట లాండ్రీకి వేసిన విషయం గుర్తువచ్చి వణికిపోయింది. ఇప్పుడెలా? బయట తిరగడానికి రెండే చీరలు! పొద్దుట మేకు తగిలి ఒకటి చిరుగుపట్టింది.

ప్రక్కింటి కుర్రవాడ్ని బతిమాలి లాండ్రీకి పంపించింది. ఆ కుర్రవాడు పరుగెత్తుకుని వచ్చి



- చెళ్లూరి సీతారాజేశ్వరరావు

్రాంగ్రెడ్ మూసివుందని చెప్పాడు. అప్పటికే మరో కబురు వచ్చింది మహిళా సమాజంనుంచి. రుక్మిణి చిరుగుల చీరనే సూదితో రెండు కుట్లు వేసుకుని, మహిళా సమాజానికి పరుగు తీసింది.

పరమేశ్వరి ఫ్యాన్ క్రింద తాంబూలం నములుతూ తోటివారితో కబుర్లు చెబుతోంది.

"కుంకుమ భరిణితో నేనే వద్దామనుకుంటున్నాను. నీ గురించి మేం ఎదురు చూడాలా?" ఎత్తిపొడుపుగా అంది పరమేశ్వరి.

రుక్మిణి మూగనోము.

"మాకేసి అలా దీప స్థంభంలా నించుని చూడటం కాదు. మీటింగ్ హాల్ సర్దించు. ఇంకా ఎవరు రావాలో చూడు. మాకంటె ముందరగావచ్చిచెయ్యడంపోయె. మేం చెప్పినా దిక్కులేదాయె!" పరమేశ్వరి చిరచిరలాడింది.

రోజూ నాలుగు గంటలకి కాని రుక్మిణి మహిళా సమాజానికి రానక్కర్లేదు. ఇంతకు ముందురోజు కూడా యివాళ మీటింగు వుందని పరమేశ్వరి ఆమెకి చెప్పలేదు.

మహిళాసమాజం నెలకి రెండు వందలు అద్దె చెల్లించే భవనంలో వుంది. విశాలమైన హాలు, ఎడా పెడా గదులు. ఓ గది అధ్యక్షురాలిది. రెండోగది స్టోర్ రూం కం ఆఫీస్ హాలు వెనక వసారాలు రెండున్నాయి. అందులో ఇన్ డోర్ గేమ్స్, లైబ్రరీ, కుట్లు వున్నాయి. పార్టుటైంగా నలుగురు పని చేస్తున్నారు.

రుక్మిణి మీటింగ్‌కి సిద్ధం చేసింది. సభ్యులు రాసాగేరు. సెక్రటరీ కామాక్షి, కోశాధికారిణి శిరీష యింకా రాలేదు.

"ఒక్కరికి డిసిప్లిన్ లేదు. ఇలాంటి మూకతో ఏం చేస్తాం?" పరమేశ్వరి విసుక్కుంది. కామాక్షి, శిరీష ఆమె ప్రత్యర్థులు. వారి మీద కోపాన్ని రుక్మిణిపై చూపించి, "వస్తున్నారేమో చూడు!" అని గద్దించింది.

మరోగంటకి శిరీష, కామాక్షి 'ఫ్యాషన్ పెరేడ్' కన్నట్లు అందంగా తయారై సెంటు వాసనలతో వచ్చారు.

"మాకోసం చూస్తున్నారా ఏమిటి?" శిరీష అడిగింది.

పరమేశ్వరి ఏమనలేక చిరునవ్వు వెలిగించి, "రండి-రండి. మనకింకో ప్రోగ్రాంకూడా వుంది" అంటూ మీటింగ్ హాలుకి దారి తీసింది.

పరమేశ్వరి స్త్రీల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న కష్టాలు

వివరించ సాగింది. ఆమెకి వుప న్యాస నేర్పుంది.

కాని ఎవరూ వినడం లేదు. చీరల గురించి, ఫ్యాషన్ల గురించి, కుటుంబగొడవలగురించి మాట్లాడు కుంటున్నారు.

పరమేశ్వరి ముగిస్తూ, "కనుక మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. స్త్రీకి స్త్రీయే అండగా వుండాలి. మన వూరిలో అనాధ శరణాలయం వుంది. దానికి మన సమాజం తరపున ఏదయినా చేస్తే బాగుంటుందనిపించింది. ఈరోజు నేను, కామాక్షి, శిరీషగార్లు అక్కడికి పోయి పరిస్థితి చూసి వస్తాం. రేపు మన అందరం కూర్చుని చర్చించి ఒక నిర్ణయానికి వద్దాం" అంది.

రుక్మిణి చప్పట్లు కొట్టాక అందరూ కొట్టారు. గోలగా లైబ్రరీకి, ఆటలకేసి చీలిపోయారు.

జీపు సిద్ధమయింది.

"మేం రావాలంటారా?" కామాక్షి ఆతృతయంగా అడిగింది. ఆమె లీడింగ్ డాక్టరు సతీమణి. పరమేశ్వరి సీటుపై ఆమెకి ఆశ వుంది.

"వస్తారనుకుంటున్నాను." పరమేశ్వరి అదే ధోరణిలో సమాధానమిచ్చింది జీపు ఫ్రంటు సీట్లో ఠీవిగా ఎక్కికూర్చుంటూ.

కామాక్షి, శిరీష ఎక్కాక రుక్మిణి కూడా ఎక్కింది. జీపు బయలుదేరింది.

అనాధ శరణాలయం వూరికి చివరగా తోటల మధ్య చిన్న పెంకుటింటిలో వుంది. జీపు నేరుగా లోపలికి వెళ్ళదు. మురుగు కాల్వ మీద మనుషులు నడిచే సిమెంట్ మాత్రమే వుంది. పరమేశ్వరి ముందర దిగింది. కాని అమాయకంగా తను లోపలికి పోవడం ఇష్టంలేక, "మేంవచ్చామనిచెప్పు" రుక్మిణిని పంపించింది.

ధర్మమూర్తి అనాధ శరణాలయానికి కొండంత అండ. ఆయన ఏడుపదుల జీవితంసాంఘిక సంస్కరణకే ఖర్చయిపోయింది.

ధర్మమూర్తి అరటి చెట్లకి బోదెలు తవ్వుతున్నాడు. పిల్లలు సాయం చేస్తున్నారు. ఆడవాళ్ళు బావిలో నీరు తెచ్చి పోస్తున్నారు.

రుక్మిణి వచ్చిచెప్పగానే చేతులు కడుక్కుని, ఉత్తరీయం కప్పుకొంటూ రోడ్డుమీదికి వచ్చారు. పరమేశ్వరిలాంటి ఖరీదైన మనుషులకిక్కడ పనేం వుందా?.... అనుకుంటూ, "నమస్కారమమ్మా!" అన్నాడు.

పరమేశ్వరి విలాసంగా నవ్వి

శిరిషా....ఈయనే ధర్మమూర్తి. పేరుకు తగ్గ మనిషి. దిక్కులేని వారికి దేముడు." మిగతా వారికి పరిచయం చేసింది—అనాధశరణాలయం గురించి, ధర్మమూర్తి గురించి అంతా తనకి తెలుసన్నట్లు.

"మహిళా సమాజం ద్వారా లక్ష రూపాయలయినా ప్రోగేసి శరణాలయానికి యివ్వాలని తీర్మానించుకున్నాం." పరమేశ్వరి ఆయన వెంట నడుస్తూ చెప్పింది.

పరమేశ్వరి, శిరిషకొంతమందిని యింటర్వ్యూచేశారు. సానుభూతితో కాదు-కాలక్షేపానికి.

చీకటి పడినతర్వాత పరమేశ్వరి బయలుదేరుతూ, "సరేధర్మమూర్తి గారూ! నాలుగు రోజుల్లో మాకు ఒకసారి కనిపించండి. ఇంతలో చర్చించి ఒక పథకం వేస్తాం. మనం ఏం చేసినా నిర్మాణాత్మకంగా ఉండాలి!" ఆదేశించింది.

జీపు స్టార్టయింది. పరమేశ్వరి రుక్మిణిమీద విరుచుకు పడింది. "బయటికి వచ్చినప్పుడు కాస్త శుభ్రంగా రావద్దూ! అక్కడనువ్వు కూడా ఒక అనాధపక్షిలావున్నావ్. మేం ఎలా వున్నాం....నువ్వెలా వచ్చావ్! ఛీ...."

'మీలా నేనుంటే నాకీ నౌకరీ ఎందుకు?' అని రుక్మిణి విలెయ్యలేదు. చీరె లాండ్రీనుంచి రాలేదని బాధగా చెప్పుకుంది

"రేపు సాయంత్రం మాఇంటికి రా. మా అమ్మాయి చీర ఇస్తాను. కొత్తదేలే! ఓ సారి కట్టింది. శిరిషా! మన దగ్గరున్న వాళ్ళను మనం చూడలేకపోతే ఎలా?" తను వాళ్ళ దరికన్నా ప్రత్యేకమైన మనిషినని గొప్పలకిపోయింది.

"కాదుమరీ .... మీ దారేవేరు. విడిచిన చీరలు మీరు కనుక రుక్మిణికి యిస్తున్నారు." కామాక్షి వ్యంగ్యంగా నవ్వింది.

మర్నాడు పరమేశ్వరి రుక్మిణికి చీర ఇచ్చింది. రుక్మిణీ దాన్ని ఇస్త్రీ చేయించి మహిళా సమాజంకి వచ్చింది. ఆ చీర 'తన దాన' మని అందరికీ ఒకటికి రెండుసార్లు చెప్పింది పరమేశ్వరి. రుక్మిణికి తల కొట్టేసినట్టయింది.

అనాధశరణాలయం గురించి ఆరురోజులు చర్చించారు. కొంత మంది విరాళాలు ప్రోగు చెయ్యమన్నారు. కామాక్షికి నాటకం వేయించి డబ్బు ప్రోగుచేద్దామని, శిరిష హిందీ నాట్యతార భరత నాట్యం పెట్టమని సూచించారు.

• • •

సినిమా తారని ఆహ్వానించడానికి శిరిష మద్రాసు బయలు

దేరింది. ఆమె వెంట కళ్యాణీ, కనకలత వున్నారు. వాళ్ళిద్దరూ మహిళా సమాజం సభ్యులే ఆఫీసర్ల పెళ్ళాలు కావడంతో శిరీషకి క్లోజ్ ఫ్రెండ్స్. ముగ్గురూ ఓ పెద్ద హోటల్లో దిగారు.

"మద్రాసు వచ్చాం కనుక నాలగూ చూసేద్దాం. మళ్ళీ స్వంత ఖర్చులతో మాటిమాటికీవస్తామా?" అంది కళ్యాణి.

వారంరోజులు వింతలు విశేషాలు చూశారు. తెచ్చిన రెండు వేలు అయిపోయాయి. నాలుగు వేలు పంపమని శిరీష మహిళా సమాజానికి టెలిగ్రాం యిచ్చింది.

డబ్బు రాగానే తారలని ఆహ్వానించడానికి స్టూడియోలకి బయలుదేరారు. ఎంత తిరిగినా లాభంలేక పోయింది. కొంతమంది రామన్నారు. కొంతమంది విపరీతంగా డబ్బు అడిగారు.

"కళకి ప్రాంతీయ భేదాలు ఏమిటి? నడవండి - బొంబాయి పోదాం. హిందీ ఆర్టిస్టులు పిలవగానే వచ్చేస్తారు." శిరీష ధైర్యం చెప్పింది.

బొంబాయి రాగానే మళ్ళీ కథ మామూలే. వింతలు చూడడానికి వూరు మీద పడ్డారు.

డబ్బు అయిపోయింది. మళ్ళీ పంపమంటే పంపరని, హేమమాలిని నాట్యం బుక్ చేశాం. అడ్వాన్సుయివ్వాలి. 'అయిదు వేలు' అర్జంటుగా పంపమని వైరిచ్చారు.

అయిదువేలు వచ్చాయి. స్టూడియో సంచారం చెయ్యగాచెయ్యగా ఒక వృద్ధతార దొరికింది. రెండు వేలకి నాట్యం చేసేస్తానంది.

"హేమ్మాలిని అని చెప్పాం.... గొడవ వస్తుందేమో?" కనకలత అన్నది.

"వూరుకుందూ. హేమ్మాలిని అక్కని చెబుదాం. మన వాళ్ళకి ఎంతమందికి తెలుస్తుంది? ఈవిడ తప్ప మనూరు వచ్చేవారు ఎవరూ కనిపించడంలేదు." శిరీష చెప్పింది.

వృద్ధతారని బుక్ చేశారు. రెండువేలు యిచ్చి అయిదువేలకి రశీదు తీసుకున్నారు! డేట్ స్థిరపరచుకుని బయలుదేరారు.

శిరీషకి పదకొండువేలు ఖర్చయింది!

అదీ సమాజం డబ్బే!

ఇది చూసి కామాక్షికి కన్ను కుట్టింది. తను గాడిద చాకిరీ చేసే నాటకాన్ని తీసుకున్నందుకు తిట్టుకుంది. తర్వాత ఆలోచించి ఓదార్చుకుంది. 'నేను మాత్రం తక్కువా?' అని విజృంభించింది.

నాటకం పుస్తకాలన్నీ తిరగేసి

వచ్చులేదని పెదవి విరిచింది. ఆ వూర్లోనే గోపిశ్రీ అనే ఉత్తరాల రచయిత వున్నాడు. యాభై రూపాయలిచ్చి వాడ్ని నాటకం రాయమంది. గోపిశ్రీ చేతకాదని మొత్తుకున్నా వినలేదు. కామాక్షి బలవంతంమీద 'నారీ విజయం' నాటకం వ్రాసి పడేశాడు. వెయ్యి రూపాయలు యిచ్చుకున్నాడని పరమేశ్వరితో చెప్పింది.

నాటకం రిహార్సల్స్ కోసం హోటల్లో రెండు గదులు నెలరోజులకి తీసుకుంది. రిహార్సల్స్ జరిగితే నటీమణులకి తాంబూలం దగ్గర్నుంచి భోజనాలదాకా అక్కడే.

పరమేశ్వరి ప్రతిదానికీ గంగిరెద్దులా తలూపడం - లేదా వొగడటం. ఎందుకంటె ఆమె లోపాలు ఆమెకున్నాయి.

విరాళాలలో మూడొంతులు ఆమె సొంత ఖాతాకి వెళ్ళిపోతున్నాయి. మిగతాది సమాజానికి

ప్రదర్శనరోజు రానేవచ్చింది. టిక్కెట్లు ఎక్కువగా అమ్మడం వల్ల హైస్కూలులోని ఓపెన్ స్టేజి తీసుకున్నారు. హైస్కూలుకి ఒక వైపున గోడలేదు. అక్కడ ఎంత కాపలా పెట్టినా వృధాఅయింది. టిక్కెట్లులేని జనం తోసుకుంటూ వచ్చేసారు. టిక్కెట్లున్నవారు కూర్చోడానికి సీట్లులేవు. గోలగా తయారయింది

ఎలాగయితేనేం 'నారీవిజయం' నాటకం ప్రారంభమైంది. దాని తర్వాత హిందీతార నాట్యం. ప్రేక్షకులు నాటకం అయాదు నిముషాలు చూసి హాయిగా నవ్వుకున్నారు. నాటకం హాస్యంగా వుందనికాదు, అందరూ పోర్షన్లు మరచిపోయారు.

ప్రేక్షకులు ఎంతసేపు సహనం చూపుతారు. అరుపులు - కేకలు! గోల-అల్లరి! ఇక నాటకం ఎవరూ చూసేలా లేరని 'భరతనాట్యం' ప్రారంభించారు. ప్రేక్షకులు హేమ్మాలిని అనుకున్నారు. కాదని తేలిపోయింది. ఆమెవేసే తింగిర గంతులు నాట్యమని ఎవరూ అనుకోలేదు

మోసం చేసినందుకు ఆగ్రహించారు. తిరిగి గోల ప్రారంభమైంది. పళ్ళు, చెప్పులు స్టేజీమీదకి రాసాగేయా వృద్ధతార కిది అర్థంకాక ఆపివేసింది.

"రుక్మిణీ....మైక్‌లో చెప్పు... అందరూనిశ్శబ్దంగాకూర్చోవాలని" ఏదో చెయ్యాలని పరమేశ్వరి ఆదేశించింది.

రుక్మిణి స్టేజీ ఎక్కి నలుగుర్నీ వేడుకుంటోంది. ప్రార్థిస్తోంది.

"అమ్మో!" అంటూ పడి

పోయింది రుక్మిణి ఒక్కసారిగా.

వృద్ధతార లోపలకి పరిగెత్తుకు పోయింది తెరపూర్తిగా వేయించి, పరమేశ్వరి రుక్మిణి దగ్గరకెళ్ళింది. రుక్మిణికి బాగా గాయమైంది.

డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లారు.

ప్రదర్శకులు దౌర్జన్యంలోకి దిగారు. కుర్చీలు విసరడం. లైట్లు బద్దలు కొట్టడం! పోలీసులు వచ్చారు. లాటీ ఛార్జీ చేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చేసరికి తెల్లారి పోయింది.

రుక్మిణికి డాక్టర్ కుట్లువేసి పంపి చాలు రోజూవచ్చి యింజెక్షను తీసుకోవాలని ఏవో మందులు రాసిచ్చాడు నాలుగురోజులయినా రుక్మిణి గాయంతగ్గలేదు బాలరాజు మందులు కొనలేక అవస్థపడుతున్నాడు. ఓ రోజు సాయంత్రం మహిళా మండలికి వెళ్లాడు. తను రుక్మిణి మొగుడ్నని చెప్పుకున్నాడు.

"రుక్మిణికి బలంగా గాయం తగిలిందమ్మా! వైద్యం చేయించలేక పోతునాను మీరు ఏదయినా సాయం చెయ్యండి!" బాలరాజు అడిగాడు

"విరాళాల డబ్బు ముట్టుకోడానికి మేం ఎవరం? అది ప్రజలది. అయినా నీ పెళ్లానికి వైద్యం చేయించుకోడం నీకు చేతకాదన్న మాట!"

ముగురూ వెటకరించారు, నవ్వారు. బాలరాజు ఖిన్నుడై వెళ్ళిపోయాడు. అతడువెళాక ముగ్గురూ లెక్కలు చూసుకున్నారు టికెట్లు విరాళాలు ద్వారా ముప్ఫయివేలు వచ్చింది. ఖర్చు ముప్ఫయిరెండు వేలు! తేలుకుట్టిన దొంగల్లా ఎవరూ మాట్లాడుకోలేదు

"ఎంత ప్రోగేశారు?" ధర్మమూర్తి వచ్చాడు.

పరమేశ్వరి వులిక్కిపడింది అతన్నిచూసి కాని సర్దుకుని, "రండి....రండి....మనకి శ్రమే మిగిలిపోయింది రెండువేలు కూడా రాలేదు. చూడండి మూర్తిగారూ! ఒకరిమీద ఆధారపడితే యిలాగే వుంటుంది. ఈ వారంలో ముఖ్యమంత్రి పర్యటనకి వస్తున్నారు. ఆయనతో చెప్పి గ్రాంటు యిప్పిస్తాను" అంది.

వాళ్ళముఖాలు చూడలేక బయటకి వెళ్ళిపోయాడు ధర్మమూర్తి.

"మనం ఏం యివ్వలేదని చెబుతాదేమో!" శిరీష అన్నది.

"యాభైవేలు యిచ్చామని చెబుదాం. దీనికి రుజువేముంది?"

గేటు దాటుతున్న ధర్మమూర్తికి మాటలు వినిపించాయి "భగవాన్! ఆ అనాధని ఎలాగూ రక్షించవు. పరమేశ్వరిలాంటి దొంగలని అనాధల్ని చెయ్యి! అప్పుడు అనాథలని మాయచేసే వాళ్ళుండరు" అనుకున్నాడు